జాతీయ దిన పత్రిక

# తొలివెలుగు

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 166 2-7-2026 వెల: రూ.2/- పేజీలు: 06



విలేకరులు కావలెను

తొలివెలుగు జాతీయ దిన పత్రిక మన భాష.. మన పత్రిక..

www.epaper.tholivelugu.com

Contacts

తెలంగాణ

94911 34365

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో

తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.


## రాష్ట్రాభివృద్ధి, తెలుగువారిని అందలం ఎక్కించటమే

# కూటమి లక్ష్యం

- పొదుపులో మన డ్వాక్రా మహిళలు దేశానికే ఆదర్శమన్న ముఖ్యమంత్రి
- నేరస్థులకు వంతపాడే రాజకీయ పార్టీలు మనకెందుకు వ్యాఖ్య
- సైకో సహకారంతోనే గొడ్డలి పార్టీ నేతల మాటలు, చేతలు అని ఆగ్రహం
- మావిగన్ అన్న వ్యక్తులు రాజధానికి రౌడీల్లా దండయాత్రలు చేస్తున్నారన్న సీఎం
- నెల్లూరు జిల్లా పున్నపువారిపల్లెలో పేదల సేవలో కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు



రాష్ట్రాభివృద్ధితో పాటు తెలుగువారిని ఉన్నత శిఖరాలకు చేర్చడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రజాభీష్టానికి అనుగుణంగానే సుపరిపాలన అందిస్తున్నామని, ప్రజల జీవితాల్లో శాశ్వత వెలుగులు నింపేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని ఆయన వివరించారు. నెల్లూరు జిల్లా గూడూరు నియోజకవర్గం పున్నపువారిపాలెంలో బుధవారం జరిగిన 'పేదల సేవలో' కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రజా వేదిక సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "ప్రజలు చూపిస్తున్న అమితమైన అభిమానం చూస్తుంటే, పడుతున్న కష్టమంతా మర్చిపోతున్నాం. గత పాలకులు నెల్లూరు జిల్లాను అత్యంత అశాస్త్రీయంగా విభజించారు. గూడూరును తిరిగి నెల్లూరు జిల్లాలో

- మిగతా 2వ పేజీలో



# రైతు భరోసా నిధులు జమ

- 10.68 లక్షల మందికి లబ్ధి
- రూ.1,590.02 కోట్లు జమ
- డీబీటీ ద్వారా ఖాతాల్లోకి నిధులు
- ఇప్పటివరకు రూ.4,072.04 కోట్లు విడుదల
- 54.96 లక్షల మంది రైతులకు లబ్ధి

2లో



# రాజస్తాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

ట్రక్కును ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు

మంటలు చెలరేగి ఎనిమిది మంది ప్రయాణికుల మృతి

# పాలనపై చర్చకు సిద్ధం..

- సమయం, తేదీ, స్థలం, టాపిక్ డిసైడ్ చేస్తే చర్చకు సిద్ధం
- సీఎం రేవంత్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్
- అప్పులు, చెల్లింపుల లెక్కలన్నీ అబద్ధాలే..
- కాగ్, ఆర్‌బీఐ చెప్పేదానికి సీఎం, డిప్యూటీ సీఎం చెప్పే వాటికి పొంతన లేదు
- రాష్ట్రాధినేతగా ఉంటూ రాష్ట్రాన్ని కించపర్చేలా మాట్లాడటం మొదటిసారి చూస్తున్నా
- రేవంత్ మానసిక స్థితి బాగా లేదేమో..
- సీఎంకు దమ్ముంటే మద్య నిషేధం విధించాలని డిమాండ్



హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన సవాల్‌ను స్వీకరిస్తున్నానని, పదేళ్ల బీఆర్ఎస్ పాలన, రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనపై బహిరంగ చర్చకు సిద్ధమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రతి సవాల్ చేశారు. అప్పులు, పాలనా వైఫల్యాలు, రైతుల దుస్థితి, వ్యవసాయ సంక్షోభం, ఆర్థిక పరిస్థితి దేనిపైనైనా సరే చర్చకు వరంగల్ చౌరస్తానా? అశోక్‌నగర్ చౌరస్తానా? అసెంబ్లీ, ప్రెస్‌క్లబ్, కొత్తగా రూ.200 కోట్లతో కట్టుకున్న సీఎం ఇంద్రభవనంలో అయినా చర్చకు సిద్ధమని అందుకు తేదీ, సమయం, ప్రాంతం సీఎం చెప్పాలని ఏ టాపిక్ అయినా సరే చర్చకు సిద్ధమని, ప్రభుత్వం వైఫల్యాలను గణాంకాలతో

- మిగతా 2వ పేజీలో

# విజయ్ ప్రభుత్వాన్ని కూల్చే కుట్ర?

- ఎమ్మెల్యేలకు రూ.35 కోట్ల ఆఫర్ ఆరోపణలు
- 15 మంది ఎమ్మెల్యేల రాజీనామాల ద్వారా ప్రభుత్వం పడగొట్టే యత్నమని ప్రచారం
- ఎమ్మెల్యేకు రూ.35 కోట్ల ఆఫర్ ఇచ్చారన్న ఆరోపణలతో ముగ్గురి అరెస్ట్
- డీఎంకే నేత సెంథిల్ బాలాజీ పేరు ప్రస్తావనకు రావడం రాజకీయంగా చర్చనీయాంశం
- ఆరోపణలను డీఎంకే ఖండిస్తూ.. ఆధారాలు ఉంటే చర్యలు తీసుకోవాలని సవాల్



## దోహా చర్చల వేళ అమెరికాకు

# ఇరాన్ గట్టి వార్నింగ్

- శాంతికి సిద్ధం.. యుద్ధానికీ రెడీ!
- శాంతి చర్చలకు ముందే యుద్ధ నినాదం
- అణు హక్కులపై రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టీకరణ
- లెబనాన్ సార్వభౌమత్వానికి ఇరాన్ డిమాండ్

ఖతార్ రాజధాని దోహా వేదికగా అమెరికాతో కీలకమైన చర్చలు ప్రారంభం కానున్న నేపథ్యంలో అగ్రరాజ్యానికి ఇరాన్ గట్టి హెచ్చరికలు జారీ చేసింది. తాము దౌత్యపరమైన శాంతి చర్చలకు కట్టుబడి ఉన్నామని, ఒకవేళ ఈ చర్చలు విఫలమై, ఇచ్చిన మాట తప్పితే మాత్రం 'యుద్ధానికి కూడా సిద్ధమే'నని ఇరాన్

- మిగతా 2వ పేజీలో



# వచ్చే ఎన్నికలు 'మావిగన్ వర్సెస్ అమరావతి'.. చూసుకుందాం: జగన్

- రాష్ట్రంలో జంగిల్ రాజ్ పాలన.. తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తిన వైఎస్ జగన్
- నేను వెళ్లిన నాలుగురోజులకు గానీ అరెస్టులు చేయలేదు.. శవాన్ని మాయం చేసినట్టుగానే
- సీసీపుటేజి కూడా మాయం.. మరి విజయవాడలోని పబ్లిక్ ప్లేస్‌లలో పుటేజి ఏమైంది?
- క్లౌడ్ సర్వర్‌లలో 90 రోజులపాటు ఉండాల్సిన పుటేజి ఎక్కడ?
- పోలీసు అధికారుల ఫోన్లు, మెసేజ్‌లు, కాల్ రికార్డ్స్ ఎందుకు పరిశీలించడం లేదు?
- ఆ తల్లి వేదన పడుతూ పెట్టుకున్న అర్జీలకు విలువ లేదా?



2లో



# ఏఐతో ట్రాఫిక్ నిర్వహణ

**హైదరాబాద్‌లో పైలట్ ప్రాజెక్టు అమలు సీఎం సమక్షంలో అనలాగ్ ఏఐ, మేఘా ఇంజనీరింగ్ మధ్య ఎంఓయూ**

హైదరాబాద్: దేశంలోనే తొలిసారిగా కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత ఫిజికల్ ఇంటెలిజెన్స్‌ను వినియోగించేందుకు వీలుగా హైదరాబాద్‌కు చెందిన మేఘా ఇంజనీరింగ్, దుబాయ్ కేంద్రంగా కార్యకలాపాలు సాగించే అనలాగ్ ఏఐ వ్యూహాత్మక భాగస్వామ్యం కుదుర్చుకున్నాయి. పైలట్ ప్రాజెక్టు కింద హైదరాబాద్‌లో ఫిజికల్ ఇంటెలిజెన్స్ ద్వారా ట్రాఫిక్ నిర్వహణ చేపట్టేందుకు బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) చేసుకున్నాయి. ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలోని బోధి పెవిలియన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో అనలాగ్ ఏఐ వ్యవస్థాపకుడు, సీఈఓ అలెక్స్ కిప్‌మాన్, మేఘా ఇంజనీరింగ్ ఎండీ పి.కృష్ణారెడ్డి పాల్గొన్నారు. భాగ్యనగరంలో ట్రాఫిక్ సిగ్నళ్లను ఏఐ సాంకేతికతతో అనుసంధానించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఈ సందర్భంగా సూచించారు. ట్రాఫిక్ రద్దీకి, వాతావరణ మార్పులకు అనుగుణంగా సిగ్నళ్లు పనిచేసే విధానాన్ని తీసుకురావాలని కోరారు. భవిష్యత్తు తరాలకు అవసరమైన మేధోపరమైన మౌలిక

- మిగతా 2వ పేజీలో

# ఆధారాలు లేని ఆరోపణలు సహించం..

- సోషల్ మీడియా దుర్వినియోగంపై పవన్ హెచ్చరిక!
- వాక్ స్వాతంత్ర్యాన్ని దుర్వినియోగం చేయొద్దని పవన్ హెచ్చరిక
- ఆధారాలు లేని ఆరోపణలు, వ్యక్తిగత దూషణలు సహించబోమని స్పష్టం
- సైబర్ వేధింపుల బాధితుల కోసం ప్రత్యేక విభాగం ఏర్పాటు
- ఆధారాలతో ఫిర్యాదు చేస్తే బీఎన్ఎస్ చట్టాల ప్రకారం కఠిన చర్యలు

2లో



జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..

# పాలనపై చర్చకు సిద్ధం..

**(మొదటి పేజీ తరువాయి)**

నిరూపించకపోతే శాశ్వతంగా రాజకీయాల నుంచి విరమించుకుంటానన్నారు. బుధవారం తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, శ్రీనివాస్ యాదవ్, వివేకానంద తదితరులతో కలిసి కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి నల్లగొండ సభ, శిల్పకళావేదిక సభలో బీఆర్ఎస్, కేసీఆర్‌ను విమర్శించడంపై కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అప్పులకు సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పే సంఖ్యలో తేడాలున్నాయని, వీరిద్దరూ చెప్పే దానికి పార్లమెంట్‌లో వీరి చీకటి మిత్రుడు రఘునందన్‌రావు అడిగిన ప్రశ్నకు కేంద్రం కాగ్, ఆర్‌బీఐ నుంచి తీసుకొని ఇచ్చిన లెక్కలకు చాలా తేడాలున్నాయన్నారు. 2014లో బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చే నాటికి ఉన్న అప్పులు రూ.72 వేల కోట్లు అయితే.. తాము దిగిపోయేనాటికి ఉన్న అప్పులు మొత్తం రూ.3.5 లక్షల కోట్లు అని, తమ పదేళ్ల కాలంలో చేసిన అప్పులు రూ.2.78 లక్షల కోట్లు అని కేటీఆర్ వెల్లడించారు. బీఆర్ఎస్ పదేళ్లలో రైతులకు రూ.1.75 లక్షల కోట్లు వ్యయం చేశారంటే.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క రూ.1.56 లక్షల కోట్లు వ్యయం చేశారంటున్నారని, ఇద్దరి మధ్య ఐదు నిమిషాల వ్యవధిలోనే రూ.20 వేల కోట్ల తేడా చెబితే ఎవరిని నమ్మాలని ప్రశ్నించారు. నెలకు అప్పులు, అసలు కింద ఈ ప్రభుత్వం చెల్లిస్తున్నది రూ.2,500 కోట్లలోపు ఉంటుందని కాగ్ నివేదిక చెబుతుంటే.. వీరు బయట మాత్రం రూ.6,000 కోట్లు చెల్లిస్తున్నారని అన్ని అబద్ధాలు చెబుతున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యులు, మంత్రులు, కాంగ్రెస్ నేతల దోపీడి వల్లనే తెలంగాణ దివాలా తీస్తోందని కేటీఆర్ ఆరోపించారు. రేవంత్‌రెడ్డి భావదారి?రద్యంతో మాట్లాడుతూ రాష్ట్రంపై విషం చిమ్ముతున్నారని విమర్శించారు. దివాలా, ఎయిడ్స్ రోగి, కేన్సర్ పేషెంట్ అంటూ తాను పాలించే రాష్ట్రం గురించి ఏ ముఖ్యమంత్రి ఇంత నీచంగా మాట్లాడరన్నారు. ఢిల్లీకి పోతే ఇజ్జత్ లేదు అని చెప్పుకుంటున్న రేవంత్‌రెడ్డి, మరి 72 సార్లు ఎందుకు ఢిల్లీకి వెళ్లాడో చెప్పాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి మాటలు చూస్తుంటే ఆయన మానసిక స్థితి సరిగ్గా లేదని, ఆయనకు మానసిక జబ్బు ఉందేమో అన్న అనుమానం వస్తుందని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతాంగం తీవ్రమైన సంక్షోభంలో కూరుకుపోయిందని, అట్లాంటి పరిపాలనకు సంబరాల పేరిట బలవంతపు కార్యక్రమాలు చేస్తున్నారని కేటీఆర్ చెప్పారు. మొన్నటికి మొన్ననే సంపూర్ణంగా రైతుబంధు వేస్తాను..అందరికీ ఇస్తాను అని చెప్పి కేవలం ఒక ఎకరానికి ఇచ్చి, ఒక్కొక్క ఎకరానికి డబ్బులు వేసిన ప్రతిసారి సంబరాలు చేసుకుంటూ ఉత్త మాటలు చెబుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని రైతులు, విద్యార్థులు, మహిళలు, రిటైర్డ్ ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులు ఇలా ఎవరికీ డబ్బులు లేవు కానీ... రాహుల్‌గాంధీకి మాత్రం వెయ్యి కోట్ల రూపాయలు ఇస్తానంటూ రేవంత్ చెబుతున్న తీరును చూసి ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారన్నారు. రేవంత్‌రెడ్డి పాలన మాత్రం పాతాళానికి పడిపోతుందని చెప్పారు. అది రాష్ట్ర ఆదాయం అయినా కావొచ్చు...రియల్ ఎస్టేట్ రంగం కావొచ్చు...చివరకు వాహనాల రిజిస్ట్రేషన్లు జీఎస్టీ వసూలు ఇలా ప్రతి ఒక్క రంగంలో మందగమనం ఉందన్నారు. రేవంత్‌రెడ్డి పాలనలో మిగిలింది మందగమనం, మందు గమనం తప్పించి ఇంకేమీ లేదన్నారు. రేవంత్‌రెడ్డి ఈరోజు రాష్ట్రంలో లిక్కర్ గురించి మాట్లాడితే ప్రజలు నవ్వుతున్నారన్నారు. నిజంగానే రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే రాష్ట్రంలో మద్యపానాన్ని నిషేధించాలని, మద్యం అమ్మకాలను నిషేధించాలని కేటీఆర్ సవాలు విసిరారు. ధాన్యం ప్రతి గింజా కొంటాం..తాము సేకరించిన ధాన్యం కేంద్రం కొనుగోలు చేయకపోతే కేంద్రంపై పోరాడుతాం అన్న సీఎం రేవంత్‌రెడ్డి..ఇప్పుడు కేంద్రం ఎంత కోటా ఇస్తే అంతే కొంటాం అంటూ నాలుక మడత తిప్పారని కేటీఆర్ విమర్శించారు.

## దోహా చర్చల వేళ అమెరికాకు ఇరాన్ గట్టి వార్నింగ్

పార్లమెంట్ స్పీకర్, చర్చల ప్రధాన ప్రతినిధి మహమ్మద్ బాగెర్ గాలిబాఫ్ స్పష్టం చేశారు. శుద్ధిచేసిన యురేనియంతో కూడిన తమ దేశ అణు హక్కుల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని, అది ఇరాన్ విధించుకున్న 'రెడ్ లైన్' (లక్ష్మణ రేఖ) అని ఆయన తేల్చిచెప్పారు. అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన అవగాహన ఒప్పందంలోని కొన్ని కీలక నిబంధనలను పూర్తిగా అమలు చేసే వరకు తాము తదుపరి దశకు వెళ్లబోమని ఇరాన్ స్పష్టం చేసింది. ముఖ్యంగా లెబనాన్‌లో యుద్ధాన్ని ముగించి, దాని సార్వభౌమత్వాన్ని కాపాడటం, ఇరాన్ చమురు ఎగుమతులు, అలాగే వ్యూహాత్మక హర్మూజ్ జలసంధి గుండా నౌకల రాకపోకల భద్రత వంటి అంశాలపై పట్టుబట్టింది. గతంలో 2015 నాటి అణు ఒప్పందం విషయంలో అమెరికా ఇచ్చిన హామీలను ఉల్లంఘించిన తీరును గాలిబాఫ్ ఈ సందర్భంగా విమర్శించారు. లెబనాన్, ఇజ్రాయెల్ దేశాల మధ్య సంబంధాల సాధారణీకరణ కోసం అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ప్రయత్నిస్తున్నారని, ఇది ప్రస్తుత అవగాహన ఒప్పందానికి విరుద్ధమని ఆయన ఆరోపించారు. అమెరికా విధించిన ఆంక్షలు (బ్లాకేడ్) తొలగిపోయిన తర్వాత తమ దేశ చమురు ఎగుమతులు పెరిగాయని, ప్రస్తుతం 40 మిలియన్ బారెళ్లకు పైగా చమురును ఎగుమతి చేస్తున్నట్లు గాలిబాఫ్ వెల్లడించారు. ఖతార్ విదేశాంగ మంత్రి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ మధ్యవర్తిత్వ చర్చలలో అమెరికా అధికారులు స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నర్‌లు కూడా పాల్గొంటున్నారు. అవగాహన ఒప్పందాన్ని ముందుకు తీసుకెళ్లే లక్ష్యంతోనే ఈ దోహా చర్చలు జరుగుతున్నప్పటికీ, ఇరాన్ ఒకవైపు చర్చలకు వస్తూనే.. మరోవైపు సైనికపరంగా యుద్ధానికి సై అనడం అంతర్జాతీయంగా తీవ్ర ఉత్కంఠను రేపుతోంది.

## ఏఐతో ట్రాఫిక్ నిర్వహణ

సదుపాయాలు,ఫిజికల్ ఇంటెలిజెన్స్ ఆధారిత పరిష్కారాల అభివృద్ధికి అనలాగ్ ఏఐ, మేఘా ఇంజనీరింగ్ భాగస్వామ్యంలో చేస్తున్న ప్రయత్నాలను ఈ సమావేశంలో కృష్ణారెడ్డి, కిప్‌మాన్ సీఎంకు వివరించారు. ట్రాఫిక్ రద్దీని గుర్తించి తదనుగుణంగా నియంత్రణకు చర్యలు తీసుకోవడం, నీటి లీకేజీని గుర్తించి పైపులైన్ల మరమ్మతుల నిర్వహణకు ముందస్తు సూచనలు చేయడం, అవసరానికి అనుగుణంగా విద్యుత్ వాడకం, అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు, అగ్నిమాపక వాహనాలకు దారి ఇవ్వడం వంటి కాగ్నిటివ్ సిటీ సదుపాయాల అభివృద్ధికి ఉన్న అవకాశాలను అనలాగ్ ఐఏ సీఈఓ కిప్‌మాన్ రేవంత్‌రెడ్డికి వివరించారు. నగర సమస్యల సత్వర పరిష్కారానికి దోహదపడే సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై చర్చించారు. నగరంలో అడ్వాన్స్‌డ్ ఫిజికల్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫార్మ్ వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. సెన్సార్లు, రొబోటిక్స్ వంటి ఫిజికల్ ఇంటలిజెన్స్ టెక్నాలజీ పరికరాల వినియోగంతో సురక్షితమైన, సమర్థవంతమైన, వేగంగా స్పందించే నగర రవాణా వ్యవస్థను అభివృద్ధి చేయవచ్చని తెలిపారు. వేగంగా విస్తరిస్తున్న పట్టణాల అవసరాలకు తగ్గట్లు ప్రభుత్వాల పనితీరు సామర్థ్యం పెంపు, పౌర సేవల మెరుగుదల, డేటా ఆధారిత మౌలిక సదుపాయాల ప్రణాళిక తయారీకి అభివృద్ధి చెందుతున్న సాంకేతికత ఎలా దోహదపడుతుందో ఇరు సంస్థల ప్రతినిధులు సీఎంకు వివరించారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు, మంత్రులు ఎం.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజు, ప్రభుత్వ సలహాదారు కె.రామకృష్ణారావు, ఇన్వెస్ట్ సీఈఓ బి.అజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

## వచ్చే ఎన్నికలు 'మావిగన్ వర్సెస అమరావతి'.. చూసుకుందాం: జగన్

అమరావతి: "రాష్ట్రంలో రూల్ ఆఫ్ లా(చట్టం) పక్కకు పోయి మొత్తం 'రూల్ ఆఫ్ ఫియర్'(భయం) రాజ్యమేలుతోంది. పోలీస్ స్టేషన్లకు వెళ్తే న్యాయం జరుగుతుందన్న నమ్మకం ప్రజల్లో సన్నగిల్లిపోయింది. ఇక్కడ జంగిల్‌రాజ్ పాలన సాగుతోంది." అంటూ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు ఎదురు లేదని, తామేం చేసినా చెల్లుతుందన్నట్లుగా ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యవహారశైలి ఉందని, రాష్ట్రంలో న్యాయం, ధర్మం గాడితప్పాయని జగన్ పేర్కొన్నారు. చంద్రబాబు తాను చేస్తున్న దోపిడీ, అవినీతి, దుర్మార్గపు పాలనతో పాటు, తాను మోసం చేసిన సూపర్ సిక్సులు, సూపర్ సెవెన్లపై ప్రశ్నించేవారి గొంతు నొక్కడం కోసం చట్టాన్ని, పోలీస్ వ్యవస్థను తన చేతుల్లోకి తీసుకుని దారుణంగా వ్యవహరిస్తున్నారని ఎత్తిచూపారు. సాయికృష్ణ లాకప్‌డెత్, శవాన్ని మాయం చేయడం, పోలీసుల వేధింపులతో క్రాంతికుమార్ ఆత్మహత్య రాష్ట్రంలో నెలకొన్న భయానక పరిస్థితులకు అద్దం పడతాయని అన్నారు. చివరకు తాను వెళ్లి సాయికృష్ణ కుటుంబాన్ని కలిసే వరకు, ప్రభుత్వంలో చలనం రాలేదని, దాదాపు 46 రోజుల పాటు గోప్యంగా ఉంచారని గుర్తు చేశారు. రాష్ట్రంలో పరిస్థితులు ఇంత దారుణంగా ఉన్నాయి కాబట్టే అంటున్నాం.. "హే రామ్.. సేవ్ ఆంధ్ర" అని జగన్ పేర్కొన్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడుతూ పోలీసు వ్యవస్థను చంద్రబాబు సర్కార్ ఆయుధంగా మార్చుకుని.. వ్యవస్థలను దిగజార్చి సాగిస్తున్న భీతావహపాలనను సాక్ష్యాధారాలతో సహా ఎత్తిచూపుతూ కడిగిపారేశారు. మీడియాతో మాట్లాడుతూ వైఎస్ జగన్ ఏమన్నారంటే..

**రాష్ట్రంలో భయం రాజ్యమేలుతోంది..**

"రెండేళ్ల క్రితం వరకు ఏ ఇంట్లో అయినా.. సంక్షేమం, అభివృద్ధి, విద్యా, వైద్యం, వ్యవసాయం, పరిపాలనా రంగాల్లో తీసుకొచ్చిన విప్లవాత్మక సంస్కరణలు, ప్రజలకు చేసిన మంచి గురించి చర్చ జరిగేది. కానీ నేడు ఏ ఇంటికి వెళ్లినా రెడ్ బుక్ రాజ్యాంగం, కస్టోడియల్ డెత్స్, చనిపోయిన తర్వాత శవాలను మాయం చేయడం, చంద్రబాబు చేసిన సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ మోసాలు, ఆయన చెబుతున్న అబద్ధాలు, చేస్తున్న టాపిక్ డైవర్షన్లు, ప్రజలకు పొడుస్తున్న వెన్నుపోట్లపైనే చర్చ జరుగుతోంది. రాష్ట్రంలో పరిస్థితి ఎలా ఉందంటే? చట్టం, న్యాయం (రూల్ ఆఫ్ లా) పక్కకు పోయి భయం(రూల్ ఆఫ్ ఫియర్) రాజ్యమేలుతోంది. పోలీస్ స్టేషన్లకు వెళ్తే న్యాయం జరుగుతుందన్న నమ్మకం, విశ్వాసం ప్రజల్లో పూర్తిగా సన్నగిల్లిపోయాయి. పోలీస్ స్టేషన్‌కు వెళ్లాలంటే భయపడే పరిస్థితులు వచ్చాయి. చంద్రబాబు చేస్తున్న దోపిడీ, అవినీతి, దుర్మార్గపు పాలన, తాను చేసిన సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ మోసాలు, ఎన్నికలప్పుడు ఆయనిచ్చిన బాండ్ల గురించి ఎవరైనా ప్రశ్నిస్తే చాలు.... ఆ ప్రశ్నించే గొంతును నొక్కే కార్యక్రమం జరుగుతోంది. చట్టాన్ని, పోలీస్ వ్యవస్థను చంద్రబాబు తన చేతుల్లో తీసుకున్నారు..

## విజయ్ ప్రభుత్వాన్ని కూల్చే కుట్ర?

తమిళనాడులో ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్ర జరిగిందంటూ సంచలన ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. ఈ కుట్రను రాష్ట్ర ఇంటెలిజెన్స్ విభాగం భగ్నం చేసిందని, ఈ కేసులో ఇప్పటికే ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు ఎన్‌డీటీవీ తన కథనంలో పేర్కొంది. ఎన్‌డీటీవీ కథనం ప్రకారం.. విజయ్ పార్టీకి చెందిన ఉతంగరై ఎమ్మెల్యే ఎన్. ఎలైయరాజా ఇచ్చిన ఫిర్యాదుతో ఈ వ్యవహారం బయటపడింది. అసెంబ్లీ స్పీకర్ జేసీడీ ప్రభాకర్‌పై అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇవ్వాలని, అందుకు రూ.35 కోట్లు ఇస్తామని ఓ కన్సల్టెన్సీ సంస్థ ప్రతినిధి తనను సంప్రదించాడని ఎమ్మెల్యే ఆరోపించారు. ఈ విషయాన్ని బయటకు చెబితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని బెదిరించినట్లు కూడా ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు ఆధారంగా దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు తొలుత చెన్నైలో ఒకరిని, అనంతరం కరూర్‌లో మరో ఇద్దరిని అరెస్ట్ చేశారు. దర్యాప్తులో ఈ వ్యవహారానికి డీఎంకే ఎమ్మెల్యే సెంథిల్ బాలాజీతో సంబంధాలున్నట్లు గుర్తించినట్లు ఎన్‌డీటీవీ పేర్కొంది. అయితే దీనిపై అధికారికంగా ఎలాంటి నిర్ధారణ వెలువడలేదు. ఈ ఘటనపై స్పందించిన తమిళనాడు మంత్రి సీటీ నిర్మల్ కుమార్.. సెంథిల్ బాలాజీకి సన్నిహితులే ఈ కుట్రలో ఉన్నారని ఆరోపించారు. విజయ్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు పలువురు ఎమ్మెల్యేలకు రూ.10 కోట్ల నుంచి రూ.50 కోట్ల వరకు ఆఫర్లు ఇచ్చారని కూడా ఆయన ఆరోపించారు. అయితే ఈ ఆరోపణలను డీఎంకే ఖండించింది. దర్యాప్తు వివరాలను లీక్ చేసి ప్రజల్లో తప్పుడు ప్రచారం సృష్టించే ప్రయత్నం జరుగుతోందని డీఎంకే అధికార ప్రతినిధి ఏ. శరవణన్ విమర్శించారు. తమ వద్ద ఆధారాలు ఉంటే సెంథిల్ బాలాజీని అరెస్ట్ చేయాలని సవాల్ విసిరారు.

## రైతు భరోసా నిధులు జమ

తెలంగాణలో వానాకాలం సీజన్‌కు సంబంధించిన రైతు భరోసా పెట్టుబడి సాయం పంపిణీ రెండో రోజూ కొనసాగింది. ప్రభుత్వం ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం మూడెకరాల వరకు భూమి ఉన్న రైతులందరి బ్యాంకు ఖాతాల్లోకి బుధవారం నిధులను డీబీటీ విధానంలో నేరుగా జమ చేసింది. ఈ విడతలో రాష్ట్రవ్యాప్తంగా 10.68 లక్షల మంది రైతులకు రూ.1,590.02 కోట్ల పెట్టుబడి సాయం అందనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఇప్పటి వరకు రైతు భరోసా కింద 54.96 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి మొత్తం రూ.4,072.04 కోట్ల నిధులను విజయవంతంగా బదిలీ చేసినట్లు తెలిపింది. వానాకాలం సాగు ప్రారంభమైన వేళ ఎరువులు, విత్తనాల కొనుగోలుకు ఈ సాయం ఉపయోగపడుతుండటంతో రైతులు సాగు పనులను వేగవంతం చేస్తున్నారు.

## ఆధారాలు లేని ఆరోపణలు సహించం..

సోషల్ మీడియా దుర్వినియోగంపై ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. వాక్ స్వాతంత్ర్యాన్ని దుర్వినియోగం చేయడం సరికాదన్నారు. ఒకరి హక్కులను మరొకరు హరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కును స్వాగతిస్తామని, కానీ ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం సహించబోమని స్పష్టం చేశారు. మత విశ్వాసాలను దెబ్బతీయడం రాజ్యాంగం కల్పించిన హక్కు కాదని పవన్ అన్నారు. వ్యక్తిగత దూషణలు, చంపేస్తామని బెదిరించడం, దేవుళ్లు, దేవతలపై ఉద్దేశపూర్వక వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. నిర్మాణాత్మక విమర్శలను ప్రభుత్వం ఎప్పుడూ స్వాగతిస్తుందని చెప్పారు. సైబర్ వేధింపులు, పరువు ప్రతిష్ఠలను దెబ్బతీసే చర్యలు ఆందోళన కలిగిస్తున్నాయని పవన్ పేర్కొన్నారు. నేరస్థులకు కులం, మతం ఉండదని స్పష్టం చేశారు. సోషల్ మీడియా వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. డిప్యూటీ సీఎం కార్యాలయంలో ఇందుకోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. బాధితులు ఆధారాలతో ఫిర్యాదు చేస్తే వెంటనే విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇలాంటి నేరాలకు పాల్పడిన వారిపై బీఎన్ఎస్ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## రాజస్తాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

జైపూర్: విలాసవంత స్లీపర్ కోచ్ బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికుల బతుకులు తెల్లవారుజామున తెల్లారిపోయాయి. ఉత్తరాఖండ్‌లోని రిషికేశ్ నుంచి బయల్దేరిన బస్సు మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నగరానికి వెళ్తూ మార్గమధ్యంలో రాజస్తాన్ గుండా ప్రయాణిస్తుండగా ప్రమాదానికి గురై బుగ్గిపాలైంది. ఈ ఘటనలో ఆరుగురు ప్రయాణికులు సజీవ దహనమయ్యారు. మరో ఇద్దరు తలకు తీవ్రమైన గాయాలతో ప్రాణాలు కోల్పోయారు. 24 మంది గాయాలపాలయ్యారు. వీరిలో 14 మంది పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. రాజస్తాన్‌లోని దౌసా జిల్లాలోని కోల్వా పోలీస్‌స్టేషన్ పరిధిలో ధనావ్దా ప్రాంతంలో బుధవారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో ప్రయాణికులున్న ఒక ట్రావెల్స్ బస్సు ముందు వెళ్తున్న ట్రక్కును ఢీకొట్టింది. దీంతో రెండు వాహనాలు రోడ్డు దాటి పక్కకు వెళ్లి మంటల్లో చిక్కుకున్నాయి. "వేగంగా ఢీకొనడంతో బస్సులోంచి నా భార్య ఎగిరిపడి ట్రక్కు, బస్సు మధ్యలో ఇరుక్కుని నా కళ్లముందు మంటల్లో కాలిపోయింది"అని ఒకతను ఏడుస్తూ చెప్పారు. "మేం జమ్మూకశ?మర్‌లో వైష్ణోదేవి ఆలయాన్ని దర్శించుకుని తిరిగొస్తున్నాం. ముందున్న ట్రక్కును బస్సు వేగంగా ఢీకొనడంతో మంటలొచ్చాయి. నా భర్త జాడ తెలీడంలేదు"అని ఒకావిడ కన్నీటిపర్యంతమయ్యారు.

## రాష్ట్రాభివృద్ధి, తెలుగువారిని అందలం ఎక్కించటమే కూటమి లక్ష్యం

**(మొదటి పేజీ తరువాయి)**

కలుపుతామని ఇచ్చిన హామీని మేము నెరవేర్చాం. సైదాపురం, కలవాయి మండలాలను కూడా తిరిగి నెల్లూరు జిల్లాలోనే విలీనం చేశాం. పరిపాలన అనేది ప్రజల అభీష్టం మేరకే సాగాలి తప్ప, పెత్తందారీ పోకడలకు ఇక్కడ తావులేదు. అందుకే రాష్ట్రవ్యాప్తంగా అశాస్త్రీయంగా జరిగిన జిల్లాల విభజనను సవరించాం. ప్రజల జీవితాల్లో సుస్థిరమైన మార్పు తీసుకురావాలన్నదే మా ధ్యేయం. సామాజిక బాధ్యతగా ప్రతి నెలా ఒకటో తేదీన నిరుపేదలకు, ఆపన్నులకు పెన్షన్ అందిస్తున్నాం. వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులతో పాటు మొత్తం 28 కేటగిరీల లబ్ధిదారులకు పింఛను అందజేస్తూ వారిని ఆదుకుంటున్నాం. పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే లక్ష్యంగా పీ4 కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటి వరకూ రూ.68,598 కోట్ల మేర పెన్షన్లను పంపిణీ చేసింది. ప్రతీ నెలా 62.20 లక్షల మంది లబ్ధిదారులకు రూ.2,712 కోట్లు చొప్పున చెల్లిస్తున్నాం" అని ముఖ్యమంత్రి వివరించారు. గడిచిన రెండేళ్ల ప్రయాణంలో రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేయటంతో పాటు వ్యవస్థలను తిరిగి గాడిలో పెట్టామని, ఎదురైన సంక్షోభాలు, సమస్యలను దాటుకుని ప్రజలకు మేలు చేసేలా అనునిత్యం పనిచేస్తున్నామని ముఖ్యమంత్రి అన్నారు. "గత పాలకులు ఐదేళ్ల పాటు విధ్వంసకర పాలనతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు. కేవలం రెండేళ్లలోనే అన్ని పనులూ పూర్తి చేశామని మేము చెప్పడం లేదు, కానీ ఒక మంచి శుభారంభం చేశాం. గత అవినీతి పాలనకు స్వస్తి పలికి, రాష్ట్రంలో మళ్లీ సుపరిపాలనను స్థాపించాం. 'మన మిత్ర' వాట్సప్ గవర్నెన్సు ద్వారా ఆన్‌లైన్‌లో సేవలను నేరుగా ప్రజల చేతుల్లోకి తీసుకువచ్చాం. కేంద్ర ప్రభుత్వ సహకారంతో అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నాం. తల్లికి వందనం, స్త్రీశక్తి, దివ్యాంగ శక్తి, మత్స్యకారుల సేవలో, ఆటో డ్రైవర్ల సేవలో వంటి పథకాల ద్వారా అండగా నిలుస్తున్నాం. పేదల జీవన ప్రమాణాలు పెంచి, వారిని ఆర్థికంగా బలోపేతం చేయడమే ఈ ప్రభుత్వ లక్ష్యం. సంపన్న వర్గాలకు చెందిన 10 శాతం మంది, అట్టడుగున ఉన్న 20 శాతం మంది పేదలను ఆదుకునేలా 'పీ4' కార్యక్రమాన్ని రూపొందించాం. ఆర్థిక అసమానతలు తొలగించి మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించేందుకు నా జీవితాన్ని అంకితం చేశాను. లక్ష మందికి పైగా మార్గదర్శులు, 10 లక్షల మందికి పైగా బంగారు కుటుంబాలను దత్తత తీసుకుని అన్ని విధాలా సహకారం అందిస్తున్నారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు 'వన్ ఫ్యామిలీ - వన్ ఎంట్రప్రెన్యూర్' కార్యక్రమాన్ని చేపట్టాం. పొదుపు ఉద్యమంలో మన డ్వాక్రా మహిళలు దేశానికే ఆదర్శంగా నిలిచారు. అందుకే బ్యాంకులు సైతం మహిళలకు పెద్ద ఎత్తున రుణాలు ఇచ్చేందుకు ఉత్సాహం చూపిస్తున్నాయి" అని ఆయన అన్నారు.

**రాష్ట్రంలోనే అగ్రగామిగా నెల్లూరు జిల్లా**

"రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలూ సమానంగా అభివృద్ధి చెందాలన్నదే మా ఆకాంక్ష. విశాఖపట్నం, అమరావతి, తిరుపతిలను కేంద్రాలుగా చేసుకుని మూడు రీజియన్లలో అభివృద్ధి ప్రణాళికలు అమలు చేస్తున్నాం. భవిష్యత్తులో సంపద సృష్టిలో నెల్లూరు జిల్లా దేశంలోనే అగ్రగామిగా నిలుస్తుంది. రామాయపట్నం, కృష్ణపట్నం పోర్టులతో పాటు దుగరాజపట్నంలో షిప్ బిల్డింగ్ సెంటర్ అందుబాటులోకి రానున్నాయి. రామాయపట్నం వద్ద బీపీసీఎల్ సంస్థ రూ. లక్ష కోట్లతో రిఫైనరీని ఏర్పాటు చేస్తోంది. ఇఫ్కో కిసాన్ సెజ్‌లో కూడా భారీగా పరిశ్రమలు వస్తున్నాయి. ఇప్పటికే గూడూరు ప్రాంతంలో 27 మెగా పరిశ్రమలు ప్రారంభం కాగా, త్వరలోనే మెగా ఫర్నిచర్ పార్కును కూడా ఏర్పాటు చేయబోతున్నాం.

# యాదాద్రి ట్రస్ట్ బోర్డులో స్థానికులకు మొండిచేయి

- ఉమ్మడి నల్లగొండ జిల్లాకు సగం మంది ప్రాతినిధ్యం కల్పించాలి
- కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు తిరుమలేష్ ధ్వజం



**తొలివెలుగు, రాజాపేట:** ప్రపంచ ప్రసిద్ధిగాంచిన యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన నూతన ట్రస్ట్ బోర్డు నియామకాల్లో స్థానిక ప్రజాప్రతినిధులకు, స్థానికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఘోర అన్యాయం చేసిందని బిఆర్ఎస్ రాజాపేట మండల పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్ విమర్శించారు. బుధవారం రాజాపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యాదాద్రి పరిసర ప్రాంతాలకు చెందిన మంత్రులు, పలువురు ఎమ్మెల్యేలు అధికార పార్టీలో కీలక స్థానాల్లో ఉన్నప్పటికీ.. పవిత్రమైన ఆలయ కమిటీలో యాదాద్రి జిల్లాకు చెందిన ఒక్క ప్రతినిధికి కూడా అవకాశం కల్పించలేకపోవడం కాంగ్రెస్ నాయకత్వ వైఫల్యానికి నిదర్శనమని మండిపడ్డారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి కనీసం సగం మందికి బోర్డులో అవకాశం కల్పించాల్సి ఉండిందన్నారు. గతంలో కేసీఆర్ నాయకత్వంలో ఆలయ పునర్నిర్మాణం జరిగినప్పుడు స్థానిక రైతులు, ప్రజలు తమ జీవనాధారమైన అమూల్యమైన భూములను, ఇళ్లను స్వచ్ఛందంగా త్యాగం చేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆలయ సంప్రదాయాలు, ఇక్కడి భౌగోళిక పరిస్థితులపై పూర్తి అవగాహన ఉన్న స్థానికులకు బోర్డులో ప్రాధాన్యం ఇవ్వాల్సింది పోయి, కొందరు బడా పెట్టుబడిదారులకు, అధికార పార్టీ అనుకూల వ్యక్తులకు కట్టబెట్టడం వెనుక రాజకీయ, స్వార్థ ప్రయోజనాలు దాగి ఉన్నాయని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసం ప్రజల ఆకాంక్షలను విస్మరిస్తున్నారని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా యాదాద్రి ట్రస్ట్ బోర్డులో స్థానికులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని, లేనిపక్షంలో స్థానిక ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ప్రజాస్వామ్యబద్ధమైన ఉద్యమాన్ని చేపడతామని తిరుమలేష్ హెచ్చరించారు.

# గ్రామీణ వైద్యుల సేవలు అభినందనీయం


- వైద్యుల దినోత్సవం సందర్భంగా ఘనంగా సత్కారం
- ప్రసాదాలు అందజేసి, శాలువాలతో సన్మానించిన ఉప్పల రమేష్



**తొలివెలుగు, రాజాపేట:** గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు అత్యవసర సమయాల్లో అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందిస్తున్న గ్రామీణ వైద్యుల పాత్ర ఎంతో అభినందనీయమని రాజాపేట మండల జర్నలిస్టుల ఫోరం, ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు ఉప్పల రమేష్ కొనియాడారు. జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం రాజాపేట మండల కేంద్రంలో పలువురు గ్రామీణ వైద్యులను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి పవిత్ర అభిషేక లడ్డు ప్రసాదాన్ని వారికి అందజేసి, చేనేత శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉప్పల రమేష్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ ఆసుపత్రులు, కార్పొరేట్ వైద్యం అందుబాటులో లేని సమయంలోనూ రోగులకు ప్రాథమిక చికిత్స అందిస్తూ ఎంతోమంది ప్రాణాలను కాపాడుతున్నారని వారి సేవలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ వైద్యుల సంఘం నాయకులు డాక్టర్ పిష్క నర్సింగరావు, డాక్టర్ చింతల రవి, ఠాగూర్ కిషన్ సింగ్, భోగ జ్ఞానేందర్, భోగ దివాకర్, శ్రీనివాసులు, సకినాల లక్ష్మణ్, చెడదీపు సురేష్, ఎక్కలదేవి సురేష్, కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ జిల్లా కమిటీ సభ్యులు నంగునూరు సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సంఘాల సభ్యులందరికీ సమగ్ర ఆరోగ్య పరీక్షలు

- మూడు నెలల్లో ప్రక్రియ పూర్తి కావాలి: జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి
- ఒక్కొక్కరికీ 30 రకాల పరీక్షల నిర్వహణ
- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మాస్టర్ ట్రైనర్ల ద్వారా శిక్షణ



**తొలివెలుగు, యాదాద్రిభువనగిరి:** జిల్లాలోని స్వయం సహాయక మహిళా సంఘాల (ఎస్‌హెచ్‌జీ) సభ్యులందరికీ దశలవారీగా సమగ్ర ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, మూడు నెలల వ్యవధిలో ఈ ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ) మనోహర్, రాష్ట్రస్థాయి అధికారులు మరియు వివిధ శాఖల ప్రతినిధులతో కలిసి ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో మొత్తం 1,94,493 మంది మహిళా సంఘాల సభ్యులు ఉన్నారని, వారందరికీ సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో వైద్య పరీక్షలు చేయాలన్నారు. ప్రతి మహిళకు 30 రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇందులో రక్తంలో చక్కెర, సీరం క్రియాటినిన్, బ్లడ్ యూరియా, ఎస్‌జీపీటీ సహా 10 బయోకెమిస్ట్రీ పరీక్షలు, థైరాయిడ్ (టీఎస్‌హెచ్) పరీక్ష, హీమోగ్లోబిన్, ప్లేట్‌లెట్ కౌంట్ వంటి 7 హీమటాలజీ పరీక్షలతో పాటు రక్తపోటు, కంటి, నోటి, చర్మ పరీక్షలు వంటి 12 రకాల స్పోక్ స్థాయి పరీక్షలు ఉంటాయన్నారు. ల్యాబ్ మౌలిక వసతులను సమీక్షించి, అవసరమైన చోట ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులను భర్తీ చేయాలని ఆదేశించారు. పోచంపల్లి, షరాజీపేట్, బీబీనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను (పీహెచ్‌సీ) మాస్టర్ ట్రైనర్ కేంద్రాలుగా గుర్తించి, సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ, డీసీహెచ్‌ఎస్, ఆర్‌ఎంఓలు, టీ-హబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.





# పీఆర్‌సీని వెంటనే అమలు చేయాలి

- పెండింగ్ డీఏలను తక్షణమే విడుదల చేయాలి
- యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెతుకు సైదులు డిమాండ్
- రాజాపేటలో సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభం

**తొలివెలుగు, రాజాపేట:** రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పీఆర్‌సీ నివేదికను తెప్పించుకుని, మెరుగైన ఫిట్‌మెంట్‌తో నూతన వేతన సవరణను తక్షణమే అమలు చేయాలని టీఎస్ యూటీఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి మెతుకు సైదులు డిమాండ్ చేశారు. బుధవారం రాజాపేట మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో టీఎస్ యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వారు అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయులను కలుస్తూ సభ్యత్వాల సేకరణ చేపట్టారు. అనంతరం జరిగిన సమావేశంలో మెతుకు సైదులు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న 5 డీఏ లను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పాఠశాలల పునఃప్రారంభమై రోజులు గడుస్తున్నా విద్యార్థులకు ఇంకా పూర్తిస్థాయిలో ఏకరూప దుస్తులు (యూనిఫాం) అందలేదని, పెరిగిన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్‌ను తక్షణమే సరఫరా చేయాలన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని, అన్ని ప్రాథమిక పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ తరగతులను ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ కరుణాకర్, రాజాపేట మండల అధ్యక్షుడు మధుసూదన్, ప్రధాన కార్యదర్శి మహేందర్, మండల కోశాధికారి అఖిల్ తదితరులు పాల్గొన్నారు.



# పాఠశాలల్లో హరిత శోభ.. ఘనంగా వనమహోత్సవం

- పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత: రాజాపేట ఏఎస్ఐ
- జాల సెయింట్ జెకర్యాస్ హైస్కూల్‌లో వేడుకలు
- మొక్కలు నాటిన సర్పంచ్ నవనీత, బిషప్ జాన్ గొల్లపల్లి



**తొలివెలుగు, రాజాపేట:** విద్యార్థులు చిన్నతనం నుంచే పర్యావరణ పరిరక్షణను ఒక బాధ్యతగా భావించాలని, భావితరాల మనుగడ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి రక్షించాలని రాజాపేట అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ (ఏఎస్ఐ) పిలుపునిచ్చారు. మండల పరిధిలోని జాల గ్రామంలో గల సెయింట్ జెకర్యాస్ హైస్కూల్ (ఇంగ్లీష్ మీడియం) లో బుధవారం వనమహోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. బిషప్ జాన్ గొల్లపల్లి, డైరెక్టర్ తిమోతి జాన్ గొల్లపల్లిల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి స్థానిక గ్రామ సర్పంచ్ గంధమల్ల నవనీత నర్సింలు, ఏఎస్ఐలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ మాట్లాడుతూ.. చదువుతో పాటు విద్యార్థులు సామాజిక బాధ్యతను అలవర్చుకోవాలన్నారు. పాఠశాల యాజమాన్య ప్రతినిధులు బాబు రావు, విజయ్, ఇన్‌ఛార్జ్ ఎమ్. వినయ్ కుమార్లు మాట్లాడుతూ తమ పాఠశాలను హరిత క్యాంపస్‌గా మార్చడమే లక్ష్యమన్నారు. ఉపాధ్యాయుడు యాకూబ్ పర్యావరణ ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం పర్యావరణంపై విద్యార్థులు వివిధ భాషల్లో ప్రసంగించి ఆకట్టుకున్నారు. శాంతిప్రియ (తెలుగు), శ్లోక్ సింగ్ (హిందీ), మన్విష్, ఆశ్రిత, సాత్విక్‌లు (ఇంగ్లీష్)లలో మాట్లాడారు. విద్యార్థులు ప్రదర్శించిన 'సేవ్ ట్రీస్' నాటిక, నాల్గో తరగతి పిల్లల సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం అతిథులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.

# వైద్యుడే దేవుడు.. టెక్నాలజీయే అస్త్రం: ఓనస్ 'రోబోటిక్' సంచలనం!

- ఎనిమిదేళ్లలోనే 12,000 విజయవంతమైన శస్త్రచికిత్సలు
- వైద్యుల దినోత్సవం రోజే 'ఆరా' కృత్రిమ మేధస్సు ల్యాబ్ ప్రారంభం
- ప్రపంచ స్థాయి వైద్యమే లక్ష్యం: ప్రసిద్ధ సర్జన్ డాక్టర్ బలరాజు నాయుడు





**తొలివెలుగు, ఎల్బీనగర్:** ఆధునిక వైద్య సాంకేతిక పరిజ్ఞానాన్ని సామాన్య ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ఓనస్ రోబోటిక్ ఆస్పత్రులు సరికొత్త రికార్డులను సృష్టిస్తూ ప్రగతి పథంలో పయనిస్తున్నాయి. జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఎల్బీనగర్‌లోని ఆస్పత్రి ప్రాంగణంలో 8వ వార్షికోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులకు నాంది పలుకుతూ నూతనంగా ఏర్పాటు చేసిన 'ఆరా' కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ - ఏఐ) ఆధారిత నిర్ధారణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కల్వకుర్తి శాసనసభ్యుడు డాక్టర్ కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా, రాక్‌వుడ్స్ అండ్ ఓనస్ గ్రూప్ చైర్మన్ రామన్ నాయుడు గౌరవ అతిథిగా హాజరై ఈ అత్యాధునిక కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ.. వ్యాధులను ప్రారంభ దశలోనే అత్యంత ఖచ్చితత్వంతో గుర్తించడంలో కృత్రిమ మేధస్సు సాంకేతికత కీలక పాత్ర పోషిస్తుందని, భవిష్యత్తు వైద్య నిర్ధారణ సేవలకు ఇది దిక్సూచిగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆస్పత్రి వ్యవస్థాపకులు, ప్రముఖ రోబోటిక్ ఆర్థోపెడిక్ నిపుణులు డాక్టర్ ఎం. బలరాజు నాయుడు మాట్లాడుతూ.. గడిచిన ఎనిమిదేళ్ల ప్రస్థానంలో ప్రజల నుంచి లభించిన అపారమైన విశ్వాసమే తమ విజయానికి పునాది అని పేర్కొన్నారు. ఇప్పటివరకు తమ ఆస్పత్రి ద్వారా 12 వేలకు పైగా విజయవంతమైన క్లిష్ట శస్త్రచికిత్సలు నిర్వహించామని, 2 లక్షల మందికి పైగా రోగులకు నమ్మకమైన సేవలు అందించి 13 ప్రతిష్ఠాత్మక పురస్కారాలను అందుకున్నామని వివరించారు. రోబోటిక్ మోకాలి, తుంటి ఎముక మార్పిడి, క్రీడా గాయాల చికిత్సలో అంతర్జాతీయ ప్రమాణాలను పాటిస్తున్నట్లు చెప్పారు. ఆస్పత్రి వైద్య సంచాలకులు డాక్టర్ పి. రవి కిరణ్ మాట్లాడుతూ.. రోగుల భద్రత, నాణ్యమైన చికిత్సలకే తాము అత్యధిక ప్రాధాన్యతనిస్తామని, ఈ నూతన ఏఐ కేంద్రం ద్వారా రోగులకు సులభంగా అర్థమయ్యే స్పష్టమైన డిజిటల్ విశ్లేషణ నివేదికలు వేగంగా లభిస్తాయని తెలిపారు. ఈ వేడుకల్లో భాగంగా సమాజ రక్షణలో నిరంతరం శ్రమిస్తున్న వైద్యులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్య నిపుణులు, ప్రజాప్రతినిధులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.





# పులిగిల్లలో ఉద్రిక్తత.. బెల్ట్ షాపుల నిషేధంపై మందుబాబుల హల్‌చల్!

- మద్యం అమ్మాల్సిందేనంటూ కిరాణా దుకాణదారుడితో కలిసి వీరంగం
- పాలకవర్గ సభ్యులపై దుర్భాషలాడిన వైనం.. మహిళా వార్డు మెంబర్లకూ తప్పని అవమానం
- వలిగొండ మండలంలో కలకలం



**తొలివెలుగు, వలిగొండ:** గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ, కుటుంబాలను గుల్ల చేస్తున్న అక్రమ బెల్ట్ షాపులను నిషేధించాలన్న గ్రామ పంచాయతీ తీర్మానాన్ని కొందరు బేఖాతరు చేయడంతో పులిగిల్ల గ్రామంలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. వలిగొండ మండల పరిధిలోని పులిగిల్ల గ్రామంలో బెల్ట్ షాపుల్లో మద్యం అమ్మకాలు జరపరాదని గ్రామ పాలకవర్గం ఏకగ్రీవంగా నిర్ణయించింది. అయితే, ఈ నిబంధనలను పూర్తిగా ఉల్లంఘిస్తూ గ్రామంలోని ఓ కిరాణా దుకాణంలో గత రెండు రోజులుగా యథేచ్ఛగా అక్రమ మద్యం అమ్మకాలు సాగిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామ ఉపసర్పంచ్, వార్డు సభ్యులతో కలిసి బుధవారం సదరు కిరాణా దుకాణం వద్దకు వెళ్లారు. గ్రామంలో బెల్ట్ షాపులపై నిషేధం ఉందని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఇక్కడ మద్యం విక్రయాలు జరపడానికి వీల్లేదని దుకాణదారుడికి స్పష్టం చేశారు. దీనిపై సదరు కిరాణా వ్యాపారి సానుకూలంగా స్పందించాల్సింది పోయి, స్థానిక మందుబాబులతో చేతులు కలిపాడు. వారిని రెచ్చగొడుతూ పాలకవర్గంపైకి ఉసిగొల్పాడు. దీంతో మందుబాబులంతా ఒక తాటిపైకి వచ్చి.. గ్రామంలో మందు అమ్మాల్సిందేనంటూ తీవ్రస్థాయిలో హల్‌చల్ చేశారు. పంచాయతీ ప్రతినిధులని కూడా చూడకుండా అసభ్య పదజాలంతో దూషిస్తూ వీరంగం సృష్టించారు. కనీసం వార్డు మెంబర్లలో ఉన్న మహిళల పట్ల కూడా మర్యాద లేకుండా, అత్యంత అసహ్యకరమైన రీతిలో ప్రవర్తించారు. ప్రజాప్రతినిధులపై మందుబాబులు ఈ స్థాయిలో తిరగబడటం మండలంలో తీవ్ర కలకలం రేపింది. అక్రమ మద్యం అమ్మకాలను అడ్డుకోవాల్సిన అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని, తక్షణమే ఈ కిరాణా దుకాణంపై మరియు వీరంగం సృష్టించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

# భూ వివాదాల పరిష్కారానికే 'భూభారతి' రీసర్వే

- రికార్డుల్లో పారదర్శకత, ఖచ్చితత్వమే లక్ష్యం: తహసీల్దార్ కిరణ్ కుమార్
- మంచ్యతండ రైతు వేదికలో అవగాహన సదస్సు
- సర్వే సిబ్బందికి రైతులు సహకరించాలని వినతి

**తొలివెలుగు, చిన్నగూడూరు:** భూ రికార్డులలో పూర్తి పారదర్శకత, ఖచ్చితత్వం సాధించడంతో పాటు భవిష్యత్తులో భూ వివాదాలకు శాశ్వతంగా చరమగీతం పాడేందుకే రాష్ట్ర ప్రభుత్వం 'భూభారతి' రీసర్వే కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందని చిన్నగూడూరు తహసీల్దార్ కిరణ్ కుమార్ తెలిపారు. జిల్లా కలెక్టర్, రెవెన్యూ డివిజనల్ అధికారి ఆదేశాల మేరకు మండల పరిధిలోని మంచ్యతండ గ్రామ రైతు వేదికలో బుధవారం భూభారతి భూముల రీసర్వేపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. కలెక్టర్ సూచనల మేరకు మండలంలో రీసర్వే ప్రక్రియను వేగవంతం చేశామని, రికార్డులు స్పష్టతతో నమోదు కావడం వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ఈ రీసర్వే ప్రక్రియ ద్వారా భవిష్యత్తులో జరిగే భూ లావాదేవీలు, వారసత్వ మార్పులు (విరాసత్), ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి సాంకేతిక ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయని ఆయన వివరించారు. రైతులు తమ పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు తదితర భూ సంబంధిత పత్రాలను సిద్ధంగా ఉంచుకుని క్షేత్రస్థాయికి వచ్చే సర్వే సిబ్బందికి పూర్తి సహకారం అందించాలని కోరారు. భూములకు సంబంధించిన సరిహద్దు వివాదాలు, సందేహాలు లేదా అభ్యంతరాలు ఏవైనా ఉంటే తక్షణమే రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సువర్ణ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రాములు, మండల వ్యవసాయ అధికారి భాస్కర్, రెవెన్యూ, సర్వే శాఖల సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.



# ప్రాణదాతలకు 'ట్రినిటీ' విద్యార్థుల ఘన సత్కారం

- వైద్యుల దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి, పీహెచ్‌సీల సందర్శన
- వైద్య సేవలను అడిగి తెలుసుకున్న తొమ్మిదో తరగతి విద్యార్థులు
- మనీ ప్లాంట్ మొక్కలు, మిఠాయిలు అందజేత - ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ కేవీబీ కృష్ణారావు
- పాఠశాల డైరెక్టర్ అండ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఉజ్జిని మంజుల





**తొలివెలుగు, చౌటుప్పల్:** పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, ప్రసిద్ధ వైద్యులు డాక్టర్ బిధాన్ చంద్ర రాయ్ (బీసీ రాయ్) జయంతి, వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం జాతీయ వైద్యుల దినోత్సవాన్ని చౌటుప్పల్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక ట్రినిటీ విద్యాసంస్థల తొమ్మిదో తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి చౌటుప్పల్‌లోని ప్రభుత్వ కార్మిక వైద్యశాల (ఏరియా ఆసుపత్రి) ను సందర్శించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పాండురంగం ఆధ్వర్యంలో విద్యార్థులు వార్డు వార్డునూ తిరుగుతూ రోగులకు అందుతున్న వైద్య సేవలను, ఆసుపత్రి నిర్వహణ తీరును క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడి వైద్యులను శాలువాలతో ఘనంగా సత్కరించి, మిఠాయిలు తినిపించి, పర్యావరణ హితంగా మనీ ప్లాంట్ మొక్కలను బహుకరించారు. అదేవిధంగా విద్యార్థుల బృందం తంగడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ) సందర్శించింది. అక్కడ డాక్టర్ కాటమరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. భగవంతుడు జీవం పోస్తే.. వైద్యుడు పునర్జన్మ ప్రసాదిస్తాడని కొనియాడారు. నిద్రాహారాలు మానేసి రోగుల బాగోగులు చూసే వైద్యులను సమాజం దేవుడిగా భావిస్తుందని, విద్యార్థులు ఉన్నత ఆశయాలతో చదివి భవిష్యత్తులో దేశానికి అవసరమైన ఉత్తమ వైద్యులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ కేవీబీ కృష్ణారావు, డైరెక్టర్ అండ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఉజ్జిని మంజుల మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సామాజిక అవగాహన, జిజ్ఞాసను పెంచేందుకే ఇటువంటి క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.





# డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పనుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

- పోచంపల్లిలో ఇండ్ల నిర్మాణాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ అనురాగ్ జయంతి
- నిర్ణీత గడువులోగా నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశం
- అధికారులపై కలెక్టర్ ఆగ్రహం

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి హెచ్చరించారు. బుధవారం పోచంపల్లి పురపాలక కేంద్రంలోని బసవలింగేశ్వర కాలనీలో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పనులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇండ్ల నిర్మాణ పురోగతి, ప్రస్తుత స్థితిగతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పెండింగ్‌లో ఉన్న పనులను ఇప్పటివరకు పూర్తి చేయకపోవడంపై అధికారుల తీరు పట్ల కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లబ్ధిదారులకు ఇండ్లను త్వరగా అందజేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉందని, అయితే అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల పనులు మందగించడం సరికాదన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల సముదాయంలో విద్యుత్, తాగునీరు, అంతర్గత రహదారులు వంటి అన్ని రకాల మౌలిక వసతులను యుద్ధప్రాతిపదికన కల్పించాలన్నారు. పనుల్లో ఎక్కడా నాణ్యత లోపించకుండా, నిర్ణీత గడువు లోపల పూర్తి చేసి పేద ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ అంజన్ రెడ్డి, రెవెన్యూ, మున్సిపల్ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

- రైతు భరోసా నిధుల విడుదలపై హర్షం
- చివరి గింజ వరకూ ధాన్యం కొనుగోలు చేశాం
- పోచంపల్లి సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మల్లేష్ యాదవ్, వెంకటేష్ యాదవ్

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** తెలంగాణ రాష్ట్రంలో రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని, అన్నదాతలకు అన్ని వేళలా కాంగ్రెస్ ప్రభుత్వం భరోసాగా నిలుస్తుందని జిల్లా సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాక మల్లేష్ యాదవ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఉప్పునూతల వెంకటేష్ యాదవ్ తెలిపారు. బుధవారం పోచంపల్లి పురపాలక కేంద్రంలో ఏర్పాటు చేసిన పార్టీ సమావేశంలో వారు మాట్లాడారు. వర్షాకాలం సీజన్ ప్రారంభమై రైతులు వరి నాట్లకు సిద్ధమవుతున్న తరుణంలో, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు భరోసా నిధులను విడుదల చేయడం హర్షణీయమన్నారు. గత రబీ సీజన్‌లో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో అనేక సవాళ్లు ఎదురైనప్పటికీ, వాటన్నింటినీ అధిగమించి రైతులు పండించిన చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేసిందని గుర్తుచేశారు. కొనుగోలు చేసిన 48 గంటల్లోనే నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజాపాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ బొడిగె శంకరయ్య, కాంగ్రెస్ నాయకులు టింకిల్ కార్ వెంకటేష్, కంటే లింగస్వామి, పానుగంటి లింగస్వామి, బుర్రి రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# నీర్నేములలో విషాదం: పాముకాటుతో మహిళ మృతి

- ఇంటి వెనుక బట్టలు ఆరవేస్తుండగా ప్రమాదం
- రామన్నపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు

**తొలివెలుగు, రామన్నపేట:** మండల పరిధిలోని నీర్నేముల గ్రామంలో పాముకాటుకు గురై సుర్వి పద్మ (58) అనే మహిళ మృతి చెందింది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పద్మ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. మంగళవారం సాయంత్రం 4 గంటల సమయంలో ఆమె ఉతికిన బట్టలను ఇంటి వెనుక భాగంలో ఉన్న ఖాళీ స్థలంలోని సెంట్రింగ్ చెక్కలపై ఆరవేస్తోంది. ఆ సమయంలో అక్కడ దాగి ఉన్న ఒక విషసర్పం ఆమె ఎడమ కాలి మడమపై కాటు వేసింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను తక్షణమే చికిత్స నిమిత్తం రామన్నపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అందించిన అనంతరం, పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం నల్గొండలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు ఆమె అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారు. మృతురాలి బంధువు సుర్వి మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రామన్నపేట సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) డి. నాగరాజు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు. మహిళ మృతితో నీర్నేముల గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.



# ఉపాధి హామీని నిర్వీర్యం చేసే 'వీబీజీ-రామ్‌జీ' విధానాన్ని రద్దు చేయాలి




- రామన్నపేట మండల వ్యాప్తంగా సీపీఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు
- సకాలంలో వేతనాలు చెల్లించి, ఉపాధిని బలోపేతం చేయాలి
- సబ్‌కా సెంటర్‌లో నిరసన ప్రదర్శన



**తొలివెలుగు, రామన్నపేట:** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఉన్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరిచేందుకు తీసుకొచ్చిన వీబీజీ-రామ్‌జీ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం, వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ, రైతు సంఘాల ఆధ్వర్యంలో బుధవారం మండల వ్యాప్తంగా విస్తృత నిరసనలు నిర్వహించారు. రామన్నపేట మండల కేంద్రంతో పాటు మునిపంపుల, కొమ్మాయిగూడెం, వెల్లంకి, ఇస్కిళ్ళ, నేర్నెముల గ్రామాల్లో ఈ నిరసన ప్రదర్శనలు జరిగాయి. మండల కేంద్రంలోని సుభాష్ సెంటర్ లో జరిగిన నిరసన సభలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జల్లెల పెంటయ్య, సీపీఎం మండల కార్యదర్శి, మునిపంపుల సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం పాల్గొని మాట్లాడారు. దేశంలోని కోట్లాది మంది గ్రామీణ పేదలకు, వ్యవసాయ కార్మికులకు కల్పవృక్షంలా ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రంలోని ప్రభుత్వం కుట్రపూరిత చర్యలు చేపడుతోందని వారు విమర్శించారు. నూతనంగా ప్రతిపాదించిన వీబీజీ-రామ్‌జీ విధానం వల్ల క్షేత్రస్థాయిలో కార్మికులకు పనిదినాలు తగ్గిపోవడంతో పాటు, వేతనాల చెల్లింపుల్లో తీవ్ర జాప్యం జరిగే ప్రమాదం ఉందన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా ఉన్న ఈ చట్టాన్ని కాపాడుకునేందుకు ఎంతటి పోరాటానికైనా సిద్ధమని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈ విధానాన్ని ఉపసంహరించుకొని, పనిదినాలను పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు వనం ఉపేందర్, కందుల హనుమంతు, జంపాల అండాలు, విజయభాస్కర్, సోములు, నాగటి ఉపేందర్, పిఎన్ఎం జిల్లా అధ్యక్షుడు గంతేపాక శివ కుమార్, నీల అయిలయ్య, మేడబోయిన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





# విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు: బెస్ట్ సేవా సొసైటీ వ్యవస్థాపకులు ఈశ్వరయ్య

- కక్కిరేణి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ
- ప్రభుత్వ బడుల బలోపేతానికి దాతలు ముందుకు రావాలి: హెచ్ఎం రాజన్‌బాబు
- ప్రైవేటుకు దీటుగా నాణ్యమైన బోధన

**తొలివెలుగు, రామన్నపేట:** విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించినప్పుడే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందని బెస్ట్ సేవా సొసైటీ వ్యవస్థాపకులు, ప్రభుత్వ గోల్డ్ మెడల్ గ్రహీత బుక్కా ఈశ్వరయ్య అన్నారు. బుధవారం రామన్నపేట మండల పరిధిలోని కక్కిరేణి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు సొసైటీ ఆధ్వర్యంలో డైరీలు, భోజనం ప్లేట్లు, స్టేషనరీ తదితర సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సి.హెచ్. రాజన్‌బాబు మాట్లాడుతూ.. స్వగ్రామంపై మమకారంతో బుక్కా ఈశ్వరయ్య ప్రతి సంవత్సరం ఇక్కడి విద్యార్థులకు సహాయ సహకారాలు అందించడం గర్వించదగ్గ విషయమన్నారు. దాతల సహకారంతోనే నేడు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ బడులు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఉత్తీర్ణత సాధిస్తున్నాయని, మరికొందరు దాతలు ముందుకు వస్తే ఫలితాలు మరింత మెరుగవుతాయని పేర్కొన్నారు. అనంతరం బుక్కా ఈశ్వరయ్య మాట్లాడుతూ.. విద్యార్థులు రాజకీయాల జోలికి పోకుండా కేవలం చదువుపైనే శ్రద్ధ పెట్టాలన్నారు. ప్రభుత్వం పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు దుస్తులు, పుస్తకాలు, మధ్యాహ్న భోజన వసతి కల్పిస్తోందని, వాటితో పాటు సేవా సంస్థల సహకారాన్ని కూడా విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. ఉపేందర్ జీ మాట్లాడుతూ.. ఆంగ్ల మాధ్యమం కోసం లక్షల రూపాయలు వెచ్చించి పిల్లలను పట్టణాలకు పంపడం బాధాకరమని, అందుకు దీటుగా మన ఊరి బడిలోనే నాణ్యమైన ఇంగ్లీష్ బోధిస్తున్నామని తెలిపారు. డిజిటల్ విద్యను కొనసాగించేందుకు దాతలు తోడ్పాటునందించాలని కోరారు. ఈ సందర్భంగా సహకరించిన దాతలు బుస్సా శ్రీనివాస్, చందా కృష్ణమూర్తి, బచ్చు విక్రమ్, మంచికంటి మంగ, సుస్మితలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పిట్ట రాంరెడ్డి, చిల్లా సురేష్, ఉపాధ్యాయులు భద్రయ్య, శ్రీనివాసరావు, శేఖర్ రెడ్డి, రమేష్, విద్యారాణి, జ్యోతి, నిర్వాహకులు వేముల సైదులు, మిర్యాల రామకృష్ణ, చిల్ల మధు, నడిగోటి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నకిరేకంటి మొగులయ్య నియామకం

- రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ఆదేశాలు
- పార్టీ బలోపేతానికి శ్రమిస్తా: మొగులయ్య
- నియోజకవర్గ వ్యాప్తంగా హర్షాతిరేకాలు

**తొలివెలుగు, రామన్నపేట:** భారతీయ జనతా పార్టీ (బీజేపీ) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా సీనియర్ నాయకుడు, నకిరేకల్ మాజీ అసెంబ్లీ అభ్యర్థి నకిరేకంటి మొగులయ్య నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు నియామక ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన బీజేపీ నల్గొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి, జిల్లా ఇన్‌ఛార్జ్ హృదయ్ ప్రతాప్, కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు గోలి మధుసూదన్ రెడ్డి, కాసం వెంకటేశ్వర్లు, గంగిడి మనోహర్ రెడ్డి, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్‌లకు మొగులయ్య ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, క్షేత్రస్థాయిలో బీజేపీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. గతంలో ఆయన పార్టీ జిల్లా కార్యదర్శిగా, ఉపాధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా సేవలందించారు. అలాగే బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సమర్థవంతంగా పనిచేసి, నకిరేకల్ నియోజకవర్గం నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసిన అనుభవం ఉంది. ఆయన నియామకం పట్ల నల్గొండ జిల్లా, నకిరేకల్ నియోజకవర్గ పరిధిలోని మండల అధ్యక్షులు, రామన్నపేట ప్రజలు, పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు.








# సర్కారు బడి చదువే.. నన్ను కలెక్టర్‌ను చేసింది!

- ప్రభుత్వ పాఠశాలల గొప్పతనాన్ని వివరించిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రమీల
- పుట్టపాక, జనగాం విద్యార్థులకు 'రిలయబుల్ ట్రస్ట్' స్టూడెంట్ కిట్స్ పంపిణీ
- ప్రైవేట్ మోజుతో ప్రభుత్వ బడులను దూరం చేసుకోవద్దు: డీఈవో బిక్షపతి




**తొలివెలుగు, సంస్థాన్ నారాయణపురం:** "ప్రభుత్వ బడులంటే నిరుపేదలు చదివేవి కావు.. అత్యుత్తమ విద్యా ప్రమాణాలు కలిగిన సరస్వతీ నిలయాలు. నేను కూడా సర్కారు స్కూల్లో చదివే డిప్యూటీ కలెక్టర్‌ను అయ్యాను" అని జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె. ప్రమీల విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపారు. బుధవారం సంస్థాన్ నారాయణపురం మండలం పుట్టపాక, జనగాం జెడ్పీ, ప్రాథమిక పాఠశాలల్లో రిలయబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో జరిగింది. డీఈవో బొల్లారం బిక్షపతితో కలిసి ఆమె చిన్నారులకు కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా డీఈవో బిక్షపతి మాట్లాడుతూ.. ప్రైవేటు వ్యామోహంలో పడి ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేసుకోవద్దని, బడులను కాపాడుకోవాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. వచ్చే సెప్టెంబర్ నెల నుండి పదో తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేక ప్రణాళికతో ఉదయం, సాయంత్రం స్పెషల్ క్లాసులు నిర్వహిస్తామని, ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ హాస్టల్‌లో చదివి, ఉన్నత స్థాయికి ఎదిగి.. నేడు సొంత ప్రాంతం పిల్లల కోసం మండలవ్యాప్తంగా 1139 మందికి స్టూడెంట్స్ కిట్స్, స్కూళ్లకు స్పోర్ట్స్ కిట్స్ అందజేసిన రిలయబుల్ ట్రస్ట్ అధినేత తుపాకుల రవి సేవలను అధికారులు కొనియాడారు. ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ తుపాకుల రవి మాట్లాడుతూ.. కరోనా సమయంలో, కండర క్షీణత బాధితులకు తమ ట్రస్ట్ చేసిన సేవలను గుర్తుచేస్తూ, విద్యార్థులు కూడా భవిష్యత్తులో నలుగురికి సేవ చేసే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు హనుమంతు, ఉదయ, ఎంఈవో శ్రీనివాస్, సర్పంచులు గజం అనిత, లోడే రఘు, రమాదేవి, రఘుమారెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

# ఎల్లమ్మ ఆలయ పునర్నిర్మాణానికి సర్పంచ్ విరాళం

- రూ. 21 వేల నగదుతో పాటు అమ్మవారి ఆభరణాల అందజేతకు హామీ
- దేవాలయ కమిటీ పెద్దల సమక్షంలో నిధుల అందజేత



**తొలివెలుగు, సంస్థాన్ నారాయణపురం:** మండల పరిధిలోని లింగవారిగూడెం గ్రామంలో వెలిసిన శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయ పునర్నిర్మాణ పనులకు గ్రామ సర్పంచ్ కత్తుల జ్యోతి వాసు బాబు తన వంతు విరాళాన్ని అందజేశారు. బుధవారం గ్రామ పెద్దలు, దేవాలయ కమిటీ సమక్షంలో ఆయన రూ. 21,000/- నగదును ఆలయ కమిటీ అధ్యక్షులు కత్తుల లక్ష్మయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామ దేవత ఆలయ పునర్నిర్మాణంలో భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందన్నారు. నగదుతో పాటు రాబోయే రోజుల్లో అమ్మవారి విగ్రహానికి వెండి కండ్లు, బంగారు పుస్తె, మెట్టెలను దాతగా తానే స్వయంగా సమకూరుస్తానని హామీ ఇచ్చారు. సర్పంచ్‌తో పాటు గ్రామానికి చెందిన కుక్కల నర్సింహ్మా ఆలయ నిర్మాణం కోసం రూ. 5,000/- విరాళం అందజేశారు. దైవకార్యానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన సర్పంచ్ కుటుంబానికి అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కమిటీ సభ్యులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ పల్లె లింగారెడ్డి, వార్డు సభ్యులు కత్తుల మల్లయ్య, కత్తుల వసంత సైదులు, ఆలయ కమిటీ ప్రతినిధులు కత్తుల సాయిలు, కత్తుల గాలయ్య, పందుల అశోక్, కత్తుల రాములు, కత్తుల నర్సింహ్మా, కత్తుల సురేష్, కత్తుల మల్లయ్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..



# స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యం:



**- దివీస్ ల్యాబ్స్ సామాజిక బాధ్యత అభినందనీయం**

**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీరు అందించడమే దివీస్ ల్యాబొరేటరీస్ సంస్థ ముఖ్య లక్ష్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ అన్నారు. బుధవారం చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని 10వ, 13వ వార్డులలో దివీస్ ల్యాబొరేటరీస్ సంస్థ యాజమాన్యం సుమారు రూ. 12,70,000/- ఆర్థిక సహాయంతో పునరుద్ధరించిన రెండు ఆర్‌ఓ (శుద్ధి చేసే) నీటి ప్లాంట్లను మున్సిపల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, స్థానిక కౌన్సిలర్లు దేప రమ్య రాజు, బత్తుల వాణి విప్లవ్ కుమార్ గౌడ్ లతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. పట్టణ ప్రజల ఆరోగ్య సంరక్షణలో భాగంగా సురక్షితమైన మంచి నీరు అందించడంలో దివీస్ సంస్థ అత్యంత కీలక పాత్ర పోషిస్తోందని ప్రశంసించారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద మూతపడిన, పాడైన నీటి ప్లాంట్లను లక్షలాది రూపాయలు వెచ్చించి పునరుద్ధరించి, తిరిగి ప్రజలకు అందుబాటులోకి తెచ్చినందుకు దివీస్ యాజమాన్యానికి మున్సిపాలిటీ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పాక చిరంజీవి, కో-ఆప్షన్ మెంబర్ పస్తం గంగారాములు, నాయకులు ఊడుగు రమేష్ గౌడ్, చింతల సాయిలు, దివీస్ సంస్థ ప్రతినిధులు బి. గోపి, జె. శివకృష్ణ, వార్డు ప్రజలు పాల్గొన్నారు.



## మహిళల కోసం కేంద్ర ప్రభుత్వం అద్భుత అవకాశం...



# మహిళల అభ్యున్నతికే ప్రభుత్వం పెద్దపీట

- 13వ వార్డులో 'ఇందిరమ్మ మహిళా శక్తి' చీరల పంపిణీ
- మున్సిపల్ కౌన్సిలర్ బత్తుల వాణి విప్లవ్ కుమార్ గౌడ్
- హాజరైన మున్సిపల్ కాంగ్రెస్ శ్రేణులు

**తొలివెలుగు, చౌటుప్పల్ :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి మహిళా సాధికారతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ పెద్దపీట వేస్తోందని చౌటుప్పల్ మున్సిపాలిటీ 13వ వార్డు కౌన్సిలర్ బత్తుల వాణి విప్లవ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. బుధవారం మున్సిపల్ కేంద్రంలోని 13వ వార్డు పరిధిలో 'ఇందిరమ్మ మహిళా శక్తి' చీరల పంపిణీ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కౌన్సిలర్ వాణి.. స్థానిక మహిళలకు చీరలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వంలో మహిళల పేరిట రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం కాంగ్రెస్ పార్టీ నిబద్ధతకు నిదర్శనమన్నారు. మహిళా సంఘాల బలోపేతం కోసం వడ్డీ లేని రుణాలు, మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణ వసతి కల్పించడం ద్వారా ప్రభుత్వం వారి ఆర్థిక ప్రగతికి బాటలు వేసిందని వివరించారు. మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రత్యేక సహకారంతో చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలో మహిళల అభ్యున్నతికి, వార్డుల సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వర్కాల కుమార్ గౌడ్, మార్గం నర్సింహ్మా యాదవ్, మొగుదాల రాములు, బొమ్మిరెడ్డి సంజీవరెడ్డి, బయ్య సంపత్, మొగుదాల రాకేష్ గౌడ్, వివిధ మహిళా సంఘాల ప్రతినిధులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# ఆ ఫారం నింపకపోతే ఓటు గల్లంతే!

- చౌటుప్పల్ తహసీల్దార్ వీరాబాయి స్పష్టీకరణ
- పట్టణంలో ఇంటింటికీ తిరిగి ఓటర్లకు అవగాహన
- 'సర్-2026' నిబంధనలు తప్పనిసరి

**తొలివెలుగు, చౌటుప్పల్ :** గతంలో ఓటు హక్కు ఉండి, ఎన్నికల్లో ఓటు వేసిన వారైనా.. ప్రస్తుతం నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటర్ల జాబితా పునఃపరిశీలన (సర్-2026) నిబంధనలు పాటించకుంటే ఓటు గల్లంతవడం ఖాయమని చౌటుప్పల్ తహసీల్దార్ వీరాబాయి హెచ్చరించారు. 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆమె చౌటుప్పల్ పట్టణంలో ఇంటింటికీ తిరుగుతూ ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో బూత్ లెవెల్ అధికారులు (బీఎల్‌ఓ) ప్రతి ఇంటికీ వచ్చి 'ఎన్యూమరేషన్ ఫారం' అందజేస్తున్నారని, ఓటర్లు దీనిని నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. బీఎల్‌ఓలు ఇచ్చే ఫారాన్ని పూర్తిగా నింపి, దానిపై ఓటరు యొక్క తాజా పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోను తప్పకుండా అతికించి తిరిగి బీఎల్‌ఓలకే అందజేయాలని స్పష్టం చేశారు. ఈ సరికొత్త ఎన్యూమరేషన్ ఫారం నింపి ఇవ్వని పక్షంలో కొత్త ఓటరు జాబితాలో పేర్లు నమోదు కాబోవని, ఫలితంగా ఓటు హక్కు కోల్పోతారని వివరించారు. కాబట్టి, మండల పరిధిలోని ఓటర్లందరూ బీఎల్‌ఓలు వచ్చే సమయంలో ఇళ్లలోనే ఉండి, ఫారాలు నింపి ఇచ్చి ఓటు హక్కును భద్రపరుచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఆర్‌ఐ గుత్తా వెంకట్ రెడ్డి, కౌన్సిలర్ దేప రమ్య రాజు, రేషన్ డీలర్ సింగిరెడ్డి రజిత శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# చౌటుప్పల్ బార్ అసోసియేషన్ సంచలన నిర్ణయం: మాజీ అధ్యక్షుడు వాకిటి నరసింహారెడ్డి ఏడాది పాటు సస్పెండ్!

- ఎన్నికల అధికారులపై సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేసినందుకు చర్యలు
- ఫోర్ మెన్ కమిటీ నివేదిక, జనరల్ బాడీ ఆమోదంతో తీర్మానం
- ఏజీపీగా కొనసాగడానికి వీల్లేదంటూ బార్ కౌన్సిల్, కలెక్టర్‌కు లేఖలు

**తొలివెలుగు, చౌటుప్పల్ :** చౌటుప్పల్ కోర్టు బార్ అసోసియేషన్‌లో తీవ్ర కలకలం రేగింది. అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ) వాకిటి నరసింహారెడ్డిపై బార్ అసోసియేషన్ తీవ్ర క్రమశిక్షణా చర్యలు తీసుకుంది. అసోసియేషన్ నిబంధనలను ఉల్లంఘించినందుకు గాను ఆయన ప్రాథమిక సభ్యత్వాన్ని ఏడాది పాటు (05-05-2026 నుండి 04-05-2027 వరకు) రద్దు చేస్తూ జనరల్ బాడీ ఏకగ్రీవంగా తీర్మానించింది. బార్ అసోసియేషన్ ప్రతినిధుల కథనం ప్రకారం.. గత మార్చి 26న జరిగిన అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్ష పదవికి పోటీ చేసిన నరసింహారెడ్డి పరాజయం పాలయ్యారు. ఆ ఓటమిని జీర్ణించుకోలేక, సదరు ఎన్నికల్లో నిష్పాక్షికంగా అధికారులుగా వ్యవహరించిన సీనియర్ న్యాయవాదులు సిహెచ్. రాధాకృష్ణ రావు, కానుగుల వెంకటయ్యలపై నరసింహారెడ్డి సోషల్ మీడియా వేదికగా అసత్య ప్రచారాలు చేశారని బార్ అసోసియేషన్ పేర్కొంది. సీనియర్ల ప్రతిష్టకు భంగం కలిగించేలా ప్రవర్తించిన ఈ వ్యవహారంపై విచారణ జరిపేందుకు బార్ అసోసియేషన్ ఒక 'ఫోర్ మెన్ కమిటీ'ని ఏర్పాటు చేసింది. కమిటీ



సమర్పించిన నివేదిక ఆధారంగా బుధవారం నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో మెజారిటీ న్యాయవాదుల ఆమోదంతో సస్పెన్షన్ వేటు వేశారు. సభ్యత్వం రద్దయిన నేపథ్యంలో నరసింహారెడ్డి ఇకపై అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ)గా కొనసాగడానికి వీల్లేదని అసోసియేషన్ తీర్మానించింది. ఈ సస్పెన్షన్ ఉత్తర్వుల ప్రతులను తెలంగాణ బార్ కౌన్సిల్ సెక్రటరీ, లా సెక్రటరీ, మరియు యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్‌కు తదుపరి చర్యల నిమిత్తం సమర్పించినట్లు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ తాదూరి పరమేష్, జనరల్ సెక్రటరీ పడమటి మహిపాల్ రెడ్డి అధికారికంగా వెల్లడించారు.

# వైద్యుల సేవలు వెలకట్టలేనివి

- చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఘనంగా డాక్టర్స్ డే
- వైద్యులను సన్మానించిన మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని
- హాజరైన కౌన్సిలర్లు, కాంగ్రెస్ శ్రేణులు

**తొలివెలుగు, చౌటుప్పల్:** సమాజంలో రోగుల ప్రాణాలు కాపాడే ప్రాణదాతలైన వైద్యుల సేవలు వెలకట్టలేనివని చౌటుప్పల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ కొనియాడారు. జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా బుధవారం చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఆమె ఆధ్వర్యంలో వైద్యుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో సేవలందిస్తున్న వైద్యాధికారులను, సిబ్బందిని ఆమె పూలబొకేలు అందించి, శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. సమాజంలో డాక్టర్లకు దేవునితో సమానమైన స్థానం ఉందన్నారు. నిరుపేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడంలో ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు చేస్తున్న కృషి ఎంతో అభినందనీయమన్నారు. ముఖ్యంగా కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లోనూ, ఇతర అత్యవసర సమయాల్లోనూ తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా రాత్రింబగళ్లు వైద్యులు అందించిన సేవలు ఎన్నటికీ మరువలేనివని గుర్తుచేశారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మరింత మెరుగైన సేవలందించి ఆసుపత్రి పేరు నిలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ ఎండి హను బాయ్, కో-ఆప్షన్ సభ్యులు బాబా షరీఫ్, డీసీసీ కార్యదర్శి చింతల సాయిలు, యువజన కాంగ్రెస్ నాయకులు సుర్కంటి బాలకృష్ణ రెడ్డి, పలువురు వైద్యాధికారులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



# ఘనంగా ఎస్ బి ఐ కూకట్ పల్లి శాఖలో 71వ ఫార్మేషన్ డే వేడుకలు

**కూకట్ పల్లి :** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్థాపించి 1955 వ 70 సంవత్సరాలు పూర్తి చేసుకుని 71 లో అడుగుపెట్టిన సందర్భంగా పూర్తి చేసుకున్న కూకట్పల్లి ఎస్బీఐ (టెంపుల్ బస్టాండ్ ) బ్రాంచ్ లో సిబ్బంది కస్టమర్స్ తో కలిసి కేక్ కట్ చేసి వేడుకలను నిర్వహించారు. బ్రాంచ్ చీఫ్ మేనేజర్ కుబేర్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా బ్యాంక్ లో ఉచిత హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపులో కస్టమర్లకు ఉచితంగా బీపీ, షుగర్ తదితర వ్యాధులకు పరీక్షలు నిర్వహించారు. అనంతరం రవీంద్ర భారతి పాఠశాలలో విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా కుబేర్ గౌడ్ మాట్లాడుతూ బ్యాంక్ సేవలను ప్రతి ఒక్కరు వినియోగించుకుని ప్రతి ఒక్కరు పొదుపు అలవర్చుకోవాలని కోవాలని, 10 సంవత్సరాల లోపు ఆడపిల్లలకు సుకన్య సమృద్ధిని యోజన పథకం ద్వారా వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది ఫీల్డ్ ఆఫీసర్ శ్రీకాంత్ రెడ్డి, వెల్త్ మేనేజర్ గౌరీష్, సర్వీస్ మేనేజర్ రోజా, రవీంద్ర భారతి పాఠశాల ప్రిన్సిపాల్ శిరీష తదితర సిబ్బంది పాల్గొన్నారు.

